హైదరాబాద్ వార్త



## మహిళలకు అండగా మహిళా కమిషన్

**మహిళా కమిషన్ ఛైర్మన్ సునీతా లక్ష్మారెడ్డి**



కంటోన్మెంట్ క్లాసిక్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ సునీతా లక్ష్మారెడ్డి

బేగంపేట జులై 12,ప్రభాతవార్త : రాజ్యాంగం కల్పించిన హక్కులను మహిళలు సద్విని యోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమీషన్ ఛైర్మన్ సునీతా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ లోని క్లాసిక్ గార్డెన్ లో మహిళా వికాస్ సంఘ్ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభాలో మహిళలు సగం శాతం ఉన్నారని, వారు తమ హక్కులను సైతం ఉపయోగించుకోవాలన్నారు. నేడు అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని,రానున్న రోజుల్లో మరింతగా రాణించాల్సిన అవసరం ఉందన్నారు. వంటింటికి పరిమితమైన మహిళలు నేడు అన్ని అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకెళ్లడం అభినందనీయమని అన్నారు.మహిళలు సమస్య వస్తే చెప్పుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని,కానీ సమస్య వస్తే పరిష్కరిం చేందుకు కమీషన్ ఎప్పుడూ సిద్దంగా ఉంటుందని తెలిపారు.మీకు ఏ సమస్య వచ్చినా 100,181లేదా మహిళా కమీషన్ వాట్సప్ హెల్ప్‌లైన్ 9490555533ఫోన్ చేయవచ్చని అన్ని విధాల మహిళలకు కమీషన్ అండగా ఉంటుందని చెప్పారు.

## తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా బోనాలు



ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో వింధ్యావాసిని అమ్మవారి బోనాలలో పాల్గొన్న రాష్ట్ర ఆయుష్ కమిషనర్ ప్రశాంతి

యూసుఫ్‌గూడ, జూలై 12, ప్రభాతవార్త : తెలంగాణ సాంప్రదాయం ఉట్టిపడేలా బోనాల ఉత్సవాలను జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలంగాణ రాష్ట్ర ఆయుష్ కమీషనర్ ఐఏఎస్ అధికారిని ఎమ్.ప్రశాంతి అన్నారు. బుధవారం ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ఆవరణలో వింధ్యావాసిని అమ్మవారి ఆలయంలో టిఎన్‌జిఓ ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాలలోని ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకున్నారు. ఆయుష్ కమీషనర్ ప్రశాంతి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈసందర్భం గా కళాశాల ఉపాధ్యాయ బృందం, ప్రిన్సిపల్ డాక్టర్ అనసూయ, కమీషనర్‌ను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనసూయ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాశ్రీనివాస్, డాక్టర్ రమాదేవి, ఎట దేవిభాయ్, టియన్‌జివో ఆయుష్ విభాగం నగర అధ్యక్షులు టి.నర్సింహాచారి, కార్యదర్శి లక్ష్మణ్, కమిటిసభ్యులు సందీప్, రమణతో పాటు కళాశాల ప్రొఫెసర్‌లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలుశిక్ష

చిక్కడపల్లి, జూలై 12 ప్రభాతవార్త: చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలుశిక్ష, జరిమానా, మరో 20మందికి జరిమానా విధిస్తూ నాంపల్లి 10వ ఎంఎం కోర్టు న్యాయమూర్తి తుది తీర్పును వెలువరించినట్లు స్థానిక ట్రాఫిక్ సిఐ ఆకుల సతీష్ పేర్కొన్నారు.

## విద్యార్థి ఆత్మహత్య



ఆదేష్‌కుమార్ మృతదేహం

దుండిగల్, జులై 12 ప్రభాతవార్త : ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం, సమస్తిపూర్ జిల్లా, సూరత్‌కంత్ ప్రాంతానికి చెందిన దర్మేంద్రమెహాత భార్యబిడ్డలతో కలిసి జీవనోపాధి కోసం 10ఏళ్ల క్రితం నగరానికి వలస వచ్చి దుండిగల్ మున్సిపాలిటీ పరిధి సారేగూడెంలో నివాసం ఉంటున్నారు. దర్మేంద్రమెహాత దంపతులు ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరు ఇద్దరు కూతుర్ల వివాహం చేయగా కుమారుడు ఆదేశ్‌కుమార్‌మెహాత(17) విద్యార్థి. గురువారం దంపతులు డ్యూటీలకు వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆదేశ్‌కుమార్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన ఇరుగుపొరుగు దర్మేంద్రమెహాతాకు తెలపగా వచ్చి చూసే సరికి ఆదేశ్‌కుమార్ మృతిచెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

# ముడుపులిస్తేనే ఫైలు కదలిక

**ప్యానల్ బోర్డు నిర్వాహకం**

**ఒక్కో విద్యుత్ కనెక్షన్‌కు లక్షల్లో వసూలు**

**డిస్కంలో వేలల్లో దరఖాస్తులు పెండింగ్**

**గగ్గోలుపెడుతున్న వినియోగదారులు**



హైదరాబాద్, జులై 12,ప్రభాతవార్త: గ్రేటర్‌లో విద్యుత్ ప్యానల్‌బోర్డ్ కనెక్షన్లు వేలల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ముడుపులిస్తే తప్ప ముందుకు సాగడం లేదు. ధరఖాస్తు దారుల నుంచి కిందిస్థాయి వరకు సిబ్బంది ఇష్టారీతిగా దండుకుంటున్నారు. అన్నీ సక్రమంగా ఉన్నా నిర్దేశించిన ధరల ప్రకారం సొమ్ము చెల్లిస్తేనే దస్త్రం ముందుకు కదులుతుంది. తక్కువలో తక్కువ రూ.లక్షల నుంచి రూ.3లక్షల వరకు దరఖాస్తుదారుడి నుంచి లాగుతున్నారు. ఈదందాపై తరుచూ ఫిర్యాదులు అందుతున్నా డిస్కం యాజమాన్యం గట్టిగా చర్యలు తీసుకోలేకపోతోంది. ఉన్నతాధికారులు చెబితే లంచంలో రాయితీ ఇస్తున్నారంటే పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. గృహ వాణిజ్య, సముదాయాలలో ఏదైనా నాలుగు కనెక్షన్లు మించితే భద్రతా దృష్ట్యా ప్యానల్ బోర్డు ఏర్పాటు విధిగా చేసుకోవాలి. ఈనిబంధనే అక్రమార్కులకు పంటపండిస్తుంది. నాలుగు మించి కనెక్షన్లు ఉంటే సమీపంలోని విద్యుత్ స్తంభం నుంచి అన్నితీగలు లాగడం ప్రమాదకరం.భద్రతా రిత్యా నిర్మాణ ప్రాంగణంలోనే ఒక బోర్డు ఏర్పాటు చేసి అక్కడ మీటర్లు అమర్చుతారు. విద్యుత్‌స్థంభం నుంచి బోర్డుకు కనెక్షన్ ఇస్తారు. నిర్మాణాలు ఎక్కువగా జరిగే శివారు ప్రాంతాల్లో వినియోగదారులు ఎక్కువగా దరఖాస్తు చేసుకుంటున్నారు.

**ప్రతిదశలో చేయి తడపాల్సిందే..** కనెక్షన్ కోసం వినియోగదారుల సేవాకేంద్రంలో మొదటగా దరఖాస్తు చేసుకోవాలి. ఇక్కడే కొందరు దళారులు తిష్ట వేస్తున్నారు. వీరుకేవలం ప్యానల్‌బోర్డ్ కనెక్షన్లు మాత్రమే చేపడతారు. సాధారణంగా దళారులు బయటివారు ఉంటే..డిస్కం లో సిబ్బందే దళారుల అవతారంఎత్తారు. వీరు లక్ష నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేస్తూ వినియోగదారులను దోచుకుంటున్నారు. వినియోగదారులు సేవా కేంద్రంనుచి దరఖాస్తు సంబంధిత ఏఈకి వెళ్తుంది. వీరు అంచనాలు రూపొందిస్తారు. ఈపనిచేయాలంటే చాలా సెక్షన్లలో రూ.10వేలు ఇవ్వాల్సిందే. అంచనా వేసే సబ్ ఇంజనీర్‌కు రూ.2వేలు,ఆపరేటర్‌కు రూవెయ్యిగా ధర నిర్ణయించారు. ఇక్కడ నుంచి డిఈ వద్దకు దస్త్రం వెలుతుంది. ఆయన అనుమతికి రూ.పదివేలు నిర్ణయించారు. అనుమతి సమాచారం వినియోగదారులకు చేరగానే వినియోగదారుల సేవా కేంద్రంలో సొమ్ము చెల్లిచాల్సి ఉంటుంది. సొమ్ముచెల్లించగానే ఏఈ వర్క్ఆర్డర్ రాసి ఇస్తారు. ఇండోర్‌స్టోర్ నుంచి మీటర్లు ఇస్తారు. ఒక్కోమీటర్‌కు రూ.500ఇవ్వాలి. అవుట్‌డోర్ స్టోర్‌నుంచి తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటి సామాగ్రిని అందజేస్తారు. వీరికి సామాగ్రి విలువను బట్టి రూ.2వేలనుంచి రూ.3వేలవరకు ఇవ్వాలి. అంచనాలో పేర్కొన్న పనులన్నీ కాంట్రాక్టర్ పూర్తి చేసాకా ఏఈ,ఏడీఈ తనిఖీ చేస్తారు. తనిఖీకి రావాలంటే మరో పదివేలు సమర్పించుకోవాలి. వీరు తనిఖీల అనంతరం నివేదికకు డీఈకి ఇస్తే.. పనిపూర్తయినట్లు నివేదిక ఇవ్వడానికి ఇంకో రూ.పదివేలు ఇచ్చుకోవాలి. సరఫరా ఇవ్వాలనే ఆదేశాలు అక్కడినుంచి ఏడీఈకి,ఏఈకి వస్తాయి. ఇక్కడ రూ.పదివేలు ముట్ట చెప్పాల్సిందే. అక్కడి నుంచి లైన్ ఇన్స్‌స్పెక్టర్‌కు రూ.ఐదువేలు ఇవ్వకుంటే సరఫరా ఇవ్వడు. లైన్‌మెన్లు, ఇతర సిబ్బందికి ఎంతోకొంత ఇవ్వాలి. కొందరు సిబ్బంది,అధికారులు నిజాయితీగా పనిచేస్తున్నా.. అధికశాతం ఇంజనీర్లు ఆరోజు ఎన్ని అంచనా ఇచ్చాం..ఎంత వచ్చిందనే లెక్కలు వేసుకుంటున్నారు.దీంతో వీరి పేరు చెప్పి దళారులు మరింత దండుకుంటున్నారు.

**నిబంధనల పేరుతో..** అన్నీ సంక్రమంగా ఉంటే దశలవారిగా దండుకుంటున్న కొందరు.. నిబంధనలు ప్రకారం లేనివివస్తే గంపగుత్తగా ధర చెబుతున్నారు. 10మీటర్ల ఎత్తు దాటిన భవనాలకు జీహెచ్‌ఎంసీ ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ సమర్పించాల్సి ఉంటుంది. కానీ అవిలేకున్నా రూ.లక్షల్లో దండుకొని కనెక్షన్లు ఇస్తున్నారు. దరఖాస్తు దారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి వదిలేస్తే ఎన్నిరోజులైనా కనెక్షన్‌రాదు. వచ్చి సంబంధిత సిబ్బందిని కలిసి ఇవ్వాల్సింది ఇస్తే చకచకా పనవుతుంది. సొమ్ము చెల్లించకపోతే ఎన్నిరోజులైనా పెండింగ్‌లోనే ఉంటాయి.పారదర్శకత లేకపోవడమే డిస్కంలో విచ్చలవిడిగా అవినీతి సాగుతుందని ఆరోపణలు ఉన్నాయి.

## హోటల్‌లో అగ్ని ప్రమాదం

వనస్థలిపురం, జూలై 12 ప్రభాతవార్త : బుధవారం తెల్లవారుజామున సుమారు 1.40 గంటల సమయంలో చింతలకుంటలోని సుబ్బయ్యగారి హోటల్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న వనస్థలిపురం పోలీసులు వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని ఎలక్ట్రిసిటీ, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి వారి సహకారంతో సుబ్బయ్య గారి హోటల్‌లో చెలరేగుతున్న మంటలను అదుపులోకి తీసుకున్నారు. నాలుగవ అంతస్తులో గాఢ నిద్రలో ఉన్న 40 మంది హోటల్ సిబ్బందిని వెనుక వెనుక వైపు మార్గం నుండి సురక్షితమైన ప్రదేశానికి వారిని తరలించి అక్కడ ఉన్న మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. ఈ సంఘటనలో సుబ్బయ్య గారి హోటల్లో ఉన్న ఏసీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫ్యాన్స్, డైనింగ్ హాల్‌కు సంబంధించిన ఫర్నిచర్ అంతా దగ్ధమైంది. సరైన సమయంలో వనస్థలిపురం పోలీస్ వారు స్పందించి తగిన చర్యలు తీసుకోవడంవల్ల 40 మంది హోటల్ సిబ్బందిని కాపాడగలిగారని పేర్కొన్నారు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్త బంద్



హైదర్‌గూడలో విద్యార్థులను అరెస్టు చేస్తున్న పోలీసులు

సైఫాబాద్, జులై 12 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా విద్యా రంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అయ్యిందని ఆరోపిస్తూ ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితిలు బుధవారం రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్‌కు పిలుపు నిచ్చాయి. రాష్ట్ర వ్యాప్తం గా విద్యా సంస్థలు బంద్ కొనసాగుతండగా హైదర్‌గూడలోని సెయింట్ పాల్స్ హైస్కూల్ మాత్రం తరగతులను యధావిధిగా నిర్వహించింది. దీంతో ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ విద్యార్థి, యువజన నాయకులు, విద్యార్థులు ధర్నా నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. అంతకు ముందు ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఆరోపించారు.

## గుండెపోటుతో బిజెపి నాయకుడు మృతి

ధర్నాచౌక్, జూలై 12, ప్రభాతవార్త: బీజేపీ సీనియర్ నాయకులు, మూడు పర్యాయాలుగా కాచిగూడ డివిజన్ అధ్యక్షునిగా పనిచేస్తున్న బండారు సంతోష్‌కుమార్ గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం మధ్యాహ్నం ఛాతిలో నొప్పి రావటంతో ఆయనను కుటుంబసభ్యులు బర్కత్‌పురాలోని శాలిని హాస్పటల్‌కు తరలించారు. కానీ అప్పటికే సంతోష్ కుమార్ మరణించాడని వైద్యులు తెలిపారు. బీజేపీలో చురుకైన కార్యకర్తగా పనిచేసి, మూడు సార్లు డివిజన్ అధ్యక్షునిగా బాద్యతలు నిర్వహించిన సంతోష్‌కుమార్ మరణవార్తతో బీజేపీ నాయకులు శోకసంద్రంలో మునిగిపోయారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, గద్వాల జిలాన్ల ఇన్‌చార్జి పి.వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.కృష్ణగౌడ్, అధికార ప్రతినిధి ఏడెల్లి అజయ్‌కుమార్, కార్పోరేటర్‌లు కన్నె ఉమాదేవి, పద్మా వెంకట్‌రెడ్డి, అమృత, బీజేపీ నగర మాజీ ఉపాధ్యక్షులు కన్న రమేష్‌యాదవ్ తదితరులు సంతోష్‌కుమార్ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు. సంతోష్ కుమార్ కు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. బుధవారం రాత్రి అంబర్‌పేట్ స్మశాన వాటికలో సంతోష్‌కుమార్ అంత్యక్రియలు నిర్వహించారు.

## మహాంకాళీ అమ్మవారి అశీస్సులు ప్రజలందరిపైన ఉండాలి: జి.కిషన్‌రెడ్డి



జి.కిషన్‌రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించిన బిజెపి నాయకులు

హైదరాబాద్, జులై 12 ప్రభాతవార్త: అంబర్‌పేటలోని శ్రీమహాంకాళీ అమ్మవారి దేవాలయాన్ని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి దంపతులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జి.కిషన్‌రెడ్డి మాట్లా డుతూ శ్రీమహాంకాళీ అమ్మవారి అశీస్సులు ప్రజలందరిపైన ఉండాలని, ప్రజలు ఏలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఆయారారోగ్యాలతోపాటు, అష్టాఐశ్వేరాలతో, సిరిసందలతో తులతూగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం బిజెపి నాయకులు కిషన్‌రెడ్డి దంపతులను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**కేంద్ర మంత్రితో మాట్లాడిన కార్పొరేటర్ మహాలక్ష్మీరామన్‌గౌడ్**

హిమాయత్‌నగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ పనులపై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితో బుధవారం డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీ రామన్‌గౌడ్ చర్చిండం జరిగింది. డివిజన్‌లో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులపైన, పెండింగ్‌లో ఉన్న పనులపైన ఆమె సవివరంగా కేంద్ర మంత్రికి వివరించడం జరిగింది. రెండు కమ్యూనిహాల్స్ నిర్మాణం, సిసి రోడ్లు తదితర పనులపై ఆమె జి.కిషన్‌రెడ్డికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు కూడా పాల్గొన్నారు.

## మనస్తాపంతో గృహిణి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న ప్రియ

జీడిమెట్ల,జూలై12 ప్రభాతవార్త: సెల్‌ఫోన్ విషయమై భార్యాభర్తల మధ్య జరిగిన వివాదం కారణంగా మనస్తాపానికి గురైన భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సూరారం విశ్వకర్మ కాలనీకి చెందిన ఎస్.ప్రియ మల్లారెడ్డి ఆసుపత్రిలో ఆయాగా పని చేసుకుంటూ భర్త రామా, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటుంది. అయితే ఈనెల 11న రాత్రిసుమారు 10గంటల సమయంలో ప్రియ, రామా సెల్‌ఫోన్ విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరగడంతో మనస్తాపం చెందిన ప్రియ మరుసటి రోజు ఉదయం ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనను చూసిన రామా భార్యను కిందకి దింపి పరిశీలించగా అప్పటికే మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## బంగారు మైసమ్మ దేవాలయంలో బోనాలు



చార్మినార్, జూలై 12 ప్రభాతవార్త : హరిబౌలిలోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు 17వ తేదీ వరకు కొనసాగనున్నాయి.బోనాలు ఉత్సవాలను పురస్కరించుకుని మందిరాన్ని అందంగా అలంకరించారు. ఆదివారం రోజున దేవాలయంలో అమ్మ వారికి బోనాల పమర్పణ, సుశీలమ్మచే రంగం కార్యక్రమం,17వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు పూలతో అలంకరించబడిన రథంపై అమ్మవారి ఘటం ఊరేగింపు మందిరం నుంచి ప్రారంభమై నయాపూల్‌లోని ఢిల్లీ దర్వాజ మూసీనది వరకు కొనసాగుతుందని దేవాలయం కమిటి అధ్యక్షులు వినయ్ దిలీకర్,ప్రధాన కార్యదర్శి మధుసూధన్ యాదవ్, ఉపాధ్యక్షులు హంసరాజ్, కార్యదర్శి రాజేష్, కోశాధికారి సిరిగిరి పాపయ్యలు తెలిపారు.

## అనాధలకు కానుకలు పంపిణీ చేసిన కెసిఆర్ మనువడు



యూసుఫ్‌గూడ స్టేట్‌హోంలో అవిభక్తకవలలు వీణా, వాణిలతో కలిసి కేక్ కట్‌చేస్తున్న కేసీఆర్ మనువడు హిమాన్షు

యూసుఫ్‌గూడ, జూలై 12, ప్రభాతవార్త : యూసుఫ్‌గూడ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ లో ఆనాధ పిల్లలు, వృద్దులు అవిభక్త కవలలు వాణి, వీణలతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మనువడు, మంత్రి కేటీఆర్ కుమారుడు హిమాంషు కేక్‌కట్‌చేసి పిల్లలకు కానుకలు పంపిణీ చేశారు. అంతకుముందు జూబ్లిహిల్స్‌లోని పెద్దమ్మ దేవాలయంలో బిఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్‌తో కలిసి పూజల్లో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కార్పోరేటర్‌లు దేదిప్య విజయ్‌కుమార్, రాజ్‌కుమార్ పటేల్, సిఎన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శ్మశాన వాటికకు ప్రహారీ గోడ నిర్మించాలి



నెక్‌నాంపూర్‌లో స్మశాన వాటికకు హద్దులు చూపించి, ప్రహారీ నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

నార్సింగి, జూలై 12 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్‌నాంపూర్ గ్రామంలో ఉన్న స్మశాన వాటికకు హద్దులు చూపించి, ప్రహారీగోడ నిర్మించి ఇవ్వాలని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు గ్రామస్థులు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, సీనియర్ నేత జయరాజ్‌లు మాట్లాడుతూ దశాబ్దాల తరబడి ఉన్న స్మశాన వాటిక చుట్టూ ప్రహారీగోడ లేకపోవడం వలన కబ్జాపాలయ్యే ప్రమాదముందని పేర్కొన్నారు. ప్రహారీని నిర్మించి, అంత్యక్రియలకు వచ్చే ప్రజల సౌకర్యాకర్థం విశ్రాంతి హాల్, స్నాన వాటికలు, వాటర్ సంప్‌లు వంటి అభివృద్ధి పనులు చేయించాల్సిన అవసరం ఉంద న్నారు. వీరి వినతిపత్రంను తీసుకున్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ వెంటనే తహసీల్దార్‌కు ఫోన్‌చేసి హద్దురాళ్ల పాతించాలని సూచించారు. అలాగే మున్సిపల్ కమీషనర్‌కు ఫోన్‌చేసి ప్రహారీగోడ ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పట్ల ఇంత వేగంగా స్పందిస్తుండడం వల్లనే వరుసగా మూడుమార్లు ప్రకాశ్‌గౌడ్ ఎమ్మెల్యేగా ఎంపికయ్యారని, నాలుగోసారి కూడా ఆయనే విజయం సాధిస్తారని రామకృష్ణారెడ్డి, జయరాజ్‌లు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బిఆర్ఎస్ అధ్యక్షులు శ్రీరాములు, వసంత్ కుమార్ చౌహాన్, నవీన్, శ్రావణ్, నరేందర్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

## ప్రతిష్టాత్మకంగా బోనాలు వేడుకలు

**డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్**



బోనాల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, జూలై 12 ప్రభాతవార్త : సికింద్రాబాద్ నియోజకవర్గలోని వివిధ ప్రాంతాల్లో రానున్న ఆది, సోమవారాల్లో జరిగే బోనాల వేడుకలు ఘనంగా జరిగేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు జరపాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ఆదేశాలు జారి చేశారు. బోనాల ఏర్పాట్లపై బుధవారం సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో సమీక్షా సమావేశం జరిపారు. అనంతరం 176 ఆలయాల నిర్వాహకులకు దాదాపు రూ. 80 లక్షల మేరకు బోనాల నిధులకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారిగా 2015 సంవత్సరంలో ప్రత్యేకంగా ఆలయాలకు నిధులు మంజూరు చేసే పద్ధతిని ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రతియేటా ప్రభుత్వం నిధులను సమకూర్చుతోందని, బోనాల వేడుకలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా జరపాలని అధికారులను ఆదేశించారు. పార్టీలు, రాజకీయాలతో నిమిత్తం లేకుండా అందరూ సహకరించాలని కో రారు. చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయంతో పాటు వందకు పైగా ఆలయాల్లో రానున్న ఆది, సోమవారాల్లో బోనాల వేడుకలు జరుగుతాయని, బోనాలు మహిళా భక్తులకు ఇబ్బంది కులుగకుండా ప్రత్యేక లైన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చిలకలగూడ మున్సిపల్ గ్రౌండ్‌లో కొంత భాగం పార్కింగ్‌కు ఏర్పాట్లు జరపాలని, వర్షపు నీటివల్ల ఇబ్బంది కలుగకుండా ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాట్లు జరపానలి తెలిపారు. ప్రతియేడు లాగే ఈయేడు కూడా జలమండలి అధికారులు ఆది, సోమవారాల్లో రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా కొనసాగంచాలని ఆదేశం చారు. ఇతర శాఖల అధికారులు కూడా బోనాల ఉత్సవాల లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఏర్పా ట్లు సక్రమంగా జరపాలని ఆదేశించారు. ఈ కార్యాక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీలత, కార్పొరేటర్‌లు హేమ, శైలజ, ప్రసన్నలక్ష్మీ, సునీత, యువనేతలు కిషోర్‌కు మార్ గౌడ్, రామేశ్వర్‌గౌడ్, కరాటేరాజు, శ్రీనివాస్, చిలకల గూడ డివిజన్ ఏసీపీ శ్రీనివాస్, జలమండలి డీజీఎం వై. కృష్ణ, సీఐలు మట్టంరాజు, మధులత, శంకర్, ఆంజనే యులు, భాస్కర్, భరత్‌కుమార్, తిమ్మప్ప అధికారులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేదు

**టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి**



దొమ్మరపోచంపల్లి సబ్‌స్టేషన్ వద్ద పార్టీశ్రేణులతో కలిసి నిరసన తెలియజేస్తున్న నర్సారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్, జులై 12 ప్రభాతవార్త : రోజురోజుకు ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణ తట్టుకోలేక భారాస ప్రభుత్వం కావాలనే కాంగ్రెస్‌పార్టీపై విషం చిమ్ముతుందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన దొమ్మర పోచంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి కేసిఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ ఆది నుండి అన్నదాతలకు అండగా ఉంటూ ఉచిత విద్యుత్ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. నేడు భారాస ప్రభుత్వం టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి మాటాలను వక్రీకరించి కాంగ్రెస్ పార్టీ రైతులకు వ్యతిరేకం అని నమ్మించే ప్రయత్నం చేయడం సిగ్గుచేటు అన్నారు. అంతకుముందు కాంగ్రెస్ శ్రేణులకు పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షులు సదానందం, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజనోళ్ళ లక్ష్మీ, దుండిగల్ మున్సిపల్ అధ్యక్షులు మద్దికుంట నవీన్‌రెడ్డి, కొంపల్లి మున్సిపల్ అధ్యక్షులు బైరి ప్రశాంత్‌గౌడ్, కౌన్సిలర్ శివకుమార్‌గౌడ్, పిఎసిఎస్ డైరెక్టర్ డప్పు నరేందర్, డిఎంసి మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి.అక్బర్, ఓబిసి సెల్ అధ్యక్షులు కుమార్‌యాదవ్, ఎస్సి సెల్ అధ్యక్షులు చింతకింది సురేష్, డిఎంసి మహిళా అధ్యక్షురాలు ఫాతిమా, ప్రధాన కార్యదర్శి సాధుయాదవ్, సైఫ్, శ్రీకాంత్, వివిధ డివిజన్ల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బోనాలు ఉత్సవాల సందర్భంగా భారీ బందోబస్తు

**చిక్కడపల్లి ఎసిపి ఎ.యాదగిరి**



చిక్కడపల్లి, జూలై 12 ప్రభాతవార్త: చిక్కడపల్లి సబ్ డివిజన్ పరిధిలోని చిక్కడపల్లి, ముషీరాబాద్, దోమలగూడ పోలీసుస్టేషన్ పరిధిలో బోనాలు ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చిక్కడపల్లి పోలీసుసబ్ డివిజన్ ఏసీపీ ఎ.యాదగిరి వివరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందుకుగాను పోలీసులు తీసుకునే చర్యలకు సంపూర్ణ సహకారాన్ని ఆలయం నిర్వాహకులు అందించాలని కోరారు. బుధవారం చిక్కడపల్లి ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కో మండపం వద్ద పోలీసుల కాపలా ఏర్పాటు చేశామని, నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. బోనాలు ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, డీజేలకు అనుమతులు లేవని, సంఘవిద్రోహ కార్యకలాపాలకు పాల్పడినా, నియమ నిబంధనలను ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, ఎవరి మనోభావాలను దెబ్బతీసే చర్యలకు పాల్పడవద్దని సూచించారు.

## రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు అర్ధరహితం



రేవంత్‌రెడ్డి దిష్ట బొమ్మనుదగ్ధం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మెహిదీపట్నం, జులై 12, ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని బిఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఠాకూర్ జీవన్‌సింగ్ అన్నారు. రైతాంగంపై అవగాహన లేకుండా మాట్లాడడం సరియైనది కాదన్నారు. తానా సభలలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం బిఆర్ఎస్ పార్టీ గుడిమల్కాపూర్ డివిజన్ ఉపాధ్యక్షులు గున్నాల రంగారెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మీనగర్ చౌరస్తాలో రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఠాకూర్ జీవన్‌సింగ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం రైతుల పక్షపాతి అన్నారు. అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ రైతాంగానికి ఉచిత కరెంటును అందిస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ విధానం మూడు పంటలని, కాంగ్రెస్ విధానం మూడు గంటలని ఎద్దేవ చేశారు. రైతులపై కాంగ్రెస్ పార్టీకి ఉన్నటువంటి చిత్తశుద్ధి ఎమిటో తానా సభలలో బయటపడిందన్నారు. రైతులను అవమానించే విధంగా మాట్లాడిన రేవంత్‌రెడ్డి వెంటనే క్షమానణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, కోదూరు శ్రీదర్‌సాగర్, శేఖర్‌యాదవ్, అడికి మల్లిఖార్జున్, కిషన్‌సింగ్, సరేందర్ రెడ్డి, సంతోష్ కుమార్, రమేష్ సింగ్, శేఖర్, రాము, రవిచారి కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్లంపేట నుండి గండిమైసమ్మకు బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ

దుండిగల్, జులై 12 ప్రభాతవార్త : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట నుండి గండిమైసమ్మ చౌరస్తాకు ఆర్టీసీ బస్సు సర్వీసును బుధవారం చైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి 30నిమిషాలకు మల్లంపేట నుండి శంభీపూర్, భౌరంపేట మీదుగా గండిమైసమ్మ చౌరస్తాకు, తిరిగి గండిమైసమ్మ చౌరస్తా నుండి భౌరంపేట, శంభీపూర్, మల్లంపేట, బాచుపల్లి మీదుగా అప్పా జంక్షన్‌కు బస్సు సర్వీసులు ఉంటాయన్నారు. విద్యార్థులతో పాటు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, అనంతస్వామి, ఫాక్స్ డైరెక్టర్ అర్కల జీతయ్య, మాజీ ఉపసర్పంచ్ అమరేందర్, మున్సిపల్ వైస్‌ప్రెసిడెంట్లు రంగయ్య, శివయాదవ్, నాయకులు ఆంజనేయులు, హన్మంతరావు, లక్ష్మీనారాయణ, గణేష్, నరహరి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల జాతర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో పాల్గొన్న శ్రీ పైనీరు ముత్యాలమ్మ దేవాలయం కమిటి ప్రతినిధులు

చార్మినార్, జులై 12 ప్రభాతవార్త : దూద్‌బౌలిలోని ఉందాబజార్ శ్రీ పైనీరు ముత్యాలమ్మ దేవాలయంలో ఈ నెల 16,17 తేదీలలో అత్యంత వైభవంగా ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలను నిర్వహించనున్నామని దేవాలయం కమిటి చైర్మన్ డి.ఆనంద్‌గుప్తా, అధ్యక్షులు వెంకటాచలం ముదిరాజ్‌లు తెలిపారు. ఉందాబజార్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం అమ్మవారికి బోనం సమర్పణ,బోనాలు ఊరేగింపు,17వ తేదీ సోమవారం రోజున రంగం, అమ్మవారి ఘటం ఊరేగింపు తదితర కార్యక్రమాలు జరగుతాయని వారు వెల్లడించారు.కాగా పాతబస్తీ బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో కమిటి ప్రతినిధులు నర్సింహ్మా ముదిరాజ్,బి.సంతోష్,సుధాకర్,నవనీత్‌లు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బిఆర్ఎస్ నాయకులు

నార్సింగి, జులై 12 ప్రభాతవార్త : రైతులకు ఉచిత కరెంటు దండగా అని, అన్నదాతలను అవమానించిన పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బుధవారం మణికొండలో బిఆర్ఎస్ నాయకులు దగ్ధం చేశారు. మంత్రి కేటీఆర్ ఆదేశానుసారం, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పిలుపు మేరకు మణికొండలో పెద్ద ఎత్తున బిఆర్ఎస్ నాయకులు గుమిగూడ రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినదించారు. అనంతరం బిఆర్ఎస్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు మాట్లాడుతూ దేశంలో 24.గంటల నాణ్యమైన కరెంటును రైతులకు అందజేస్తున్నది ఒక్క తెలంగాణ రాష్ట్రమేనని తెలిపారు. రైతులు ఏటా రెండు పంటలు వేసుకొని ఆర్థికంగా ఎదుగుతుంటే ఓర్వలేని రేవంత్‌రెడ్డి ఉచిత కరెంటు దండగా అని మాట్లాడడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. రైతు బంధు, రైతు భీమా, పంటకు గిట్టుబాటు ధర ఇస్తూ ఆదుకుంటుందని మనమేనని తెలిపారు. ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.73.వేల కోట్లను రైతు బంధు కింద అందించడం జరిగిందని, కాంగ్రెస్ తన 60.ఏళ్లల్లో ఒక్క రోజైనా ఈ ఆలోచన చేసిందా అని ప్రశ్నించారు. మరోమారు పని చేసే బిఆర్ఎస్ సర్కారును దూషిస్తే ఊరుకునేది లేదని, రైతులు, రాష్ట్ర ప్రజలే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెగ్యులరైజ్ చేయాలని బోనాలతో నిరసన



ఒ.యూలో బోనాలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఒయూ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు

తార్నాక, జులై 12 ప్రభాతవార్త : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ బుధవారం ఒ.యూలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు వినూత్నంగా బోనాలు ఎత్తుకొని ర్యాలీ నిర్వహించారు. ఒ.యూ ఆర్ట్స్ కాలేజ్ నుంచి బోనాలతో నడుచుకుంటు వెళ్లి లేడీస్ హాస్టల్ సమీపంలో ఉన్న ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ డా. ధర్మతేజ్, డా.జితెందర్ రెడ్డి, శైలజా రెడ్డి, డా.వినితా పాండే, డా.పరుశురాం, డా.పరందాములు, అంబటి శ్రీనివాస్, డా,తిరుపతి, డా.కవితారెడ్డి, విజయ్, విజయలక్ష్మి, డా.షంషుద్దీన్, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మద్యం మాదకద్రవ్యాలను నియంత్రించాలి: ఎం.వి.పౌండేషన్



మద్యం మాదకద్రవ్యాలను నియంత్రించాలి అడ్డగుట్టలో నిరసన తెలుపుతున్న ఎం.వి.పౌండేషన్ ప్రతినిధులు

అడ్డగుట్ట, జులై 12 ప్రభాతవార్త: మన బాలలను రక్షించుటకు మద్యం,మాదకద్రవ్యాలను నియంత్రణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని బాలలహక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మి నారాయణ, తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జి.భాగ్యలక్ష్మిలు డిమాండ్ చేశారు. బుధవారం అడ్డగుట్టలో మద్యం,మాదకద్రవ్యాల నియంత్రణపై అంగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ఏ.వి.ఎం. స్వామి, సువర్ణ, భాగ్య, లావణ్య, రాధిక తదితరులు పాల్గొన్నారు. అనంతరం అడ్డగుట్ట నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా నర్సింగ్‌రావ్, కో-కన్వీనర్లుగా బాలమణి, రామలీలా,సలహాదారులుగా ఎం.అజయ్ బాబులతో పాటు 9 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

## ఘనంగా లాల్‌బజార్ బోనాల జాతర

తిరుమలగిరి,జులై 12 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని 7వ పరిధిలోని లాల్ బజార్ మహంకాళి బోనాల జాతర బుధవారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. బోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, కళాకారుల ఆటపాటలతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. బుధవారం తెల్లవారు జాము నుండే మహిళలు బోనం ఎత్తుకొని అమ్మవారికి కల్లు శాఖలు పోసి బోనం మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో ఆలయం కిటకిటలాడడమే కాకుండా లాల్ బజార్ ప్రాంతమంతా జనసందోహంగా మారింది. ప్రముఖులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అందరిని చల్లంగా చూడాలని వేడుకున్నారు. లాల్ బజార్ లోని మహంకాళి అమ్మవారి భక్తులతో పాటు పలువురు రాజకీయ నాయకులు సైతం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

## మల్లాపూర్ రోడ్డులో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



మల్లాపూర్ చౌరస్తాలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

తార్నాక, జులై 12 ప్రభాతవార్త: విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు చేసిన వాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ అదిష్టానం పిలుపు మేరకు బుధవారం మల్లాపూర్ శివహోటల్ వద్ద రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు ఉచిత విద్యుత్ అవసరం లేదని చేసిన వాఖ్యలు రైతుల పట్ల ఆయనకు ఉన్న చిత్త శుద్ధి తెలియజేస్తుందన్నారు. రేవంత్ రెడ్డి రైతులపై అవగాహణ లేని మాటలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డివిజన్ అధ్యక్షుడు పల్లా కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి తండా వాసుదవేవ్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాత నేరస్తుడు అరెస్టు.. సొత్తు స్వాధీనం

### ఒకే రోజులో కేసును ఛేదించిన పోలీసులు

తార్నాక, జులై 12 ప్రభాతవార్త : ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో విలువైన బంగారం ఇతర వస్తువులను చోరికి పాల్పడిన పాత నేరస్తుడిని అరెస్టు చేసి వస్తువులను స్వాదీనం చేసుకున్న సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.ఎస్సై కుమారస్వామి కథనం ప్రకారం... మూడున్నర తులాల బంగారు ఆభరణాలు,అరకిలో వెండి ఆభరణాలు స్వాదీనం చేసుకున్నారు. బాబానగర్‌కు చెందిన సందీప్ సింగ్ మంగళవారం తన ఇంటికి తాళాలు వేసి విధుల నిమిత్తం బయటకు వెళ్లాడు.సాయంత్రం ఇంటికి వచ్చిచూడగా ఇంటి తాళాలు పగులగొట్టి కనిపించాయి. దీంతో ఆందోళనకు గురైన అతను ఇంట్లో దొంగతనం అయ్యిందని గ్రహించి వెంటనే పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు మొదలు పెట్టారు. కేసును స్టడీ చేసిన పోలీసులు ఆదారాలు సేకరించి పాతనేరస్తుడైన చిట్యాల దీపక్(28)ను అరెస్టు చేశారు.24గంటల్లోపే కేసును ఛేదించిన క్రైం పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.

## సూరారం డివిజన్‌లో ఎమ్మెల్యే ప్రగతి యాత్ర



స్థానికులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కెపి వివేకానంద్

పేట్‌బషీరాబాద్, జులై12 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్, నెహ్రూనగర్‌లలో బుధవారం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ప్రగతి యాత్ర నిర్వహించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డివిజన్ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానికులు తాము ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ, వరదనీరు వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను త్వరగా పరిష్కరించి స్థానికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం అప్పలనాయుడు, డీఈఈ శిరీష, బీఆర్ఎస్ నాయకులు పుప్పాల భాస్కర్, సిద్ధిక్, అరుణ, ఫిరోజ్, ముకుందం, గండయ్య, నవీన్, విఠల్, అఖిల్, దశరథ్, కిరణ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

### అమ్మవారి కల్యాణోత్సవాన్ని తిలకించిన కార్పొరేటర్

చిక్కడపల్లి, జులై 12 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ టిఆర్టీ శ్రీ వరాల పోచమ్మ దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా జరిగిన అమ్మవారి కల్యాణోత్సవ కార్యక్రమంలో గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్, బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయానికి చేరుకున్న పావనీ వినయకుమార్‌కు వేదపండితులు స్వాగతం పలికి అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు. బిజెపి గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రత్నాసాయిచంద్, ఆకు సురేందర్, నేతలు అరుణ్‌కుమార్, ఆకుల అభిషేక్, ఆలయం చైర్మన్ సిహెచ్. నిరంజన్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.కనకరాజ్, యేసురత్నం, పాల్గొన్నారు.

### మారుతున్న కాలానుగుణంగా

### ఆహారపు అలవాట్లు మారాలి: శర్మ పిలుపు

సైఫాబాద్, జులై 12 ప్రభాతవార్త: నేటి ప్రపంచీకరణ, కంప్యూటర్ యుగంలో మానవుడు సంపాదనపై పడి ఆరోగ్యంపై దృష్టి సారించడం లేదని, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహారపు అలవాట్లు, ఇతర కారణాలతో ఏదోక వ్యాధుల బారిపడుతున్నారని మహర్షి యోగా హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ నరేంద్రకుమార్‌శర్మ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆహారపు అలవాట్లను మార్చడానికి, ఆరోగ్యవంతంగా జీవించడానికి తమ ఫౌండేషన్ ద్వారా యోగాలో శిక్షణ ఇస్తామన్నారు. యోగా ద్వారా ఆత్మ విశ్వాసం పెరుగుతుందని, దృఢమైన సంకల్పం అలవడుతుందని ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చునని ఆయన సూచించారు. తమ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు యోగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఫౌండేషన్ సభ్యులు ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఫౌండేషన్ కన్వీనర్లుగా వి.నరేష్, టి.మహేందర్, ఎన్.ప్రవీణ్, ఎస్.నగేష్‌కుమార్ నియమితులైనారు.

## ఆగస్టు 2న వికలాంగుల చలో ఢిల్లీ

### అఖిలభారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు

చిక్కడపల్లి, జులై 12 ప్రభాతవార్త: దేశ జనాభాలో 8శాతం మంది దివ్యాంగులకు దక్కవలసిన రాజకీయ రిజర్వేషన్‌లు ఇప్పటివరకు వివిధ రాజకీయ పార్టీలు ఇవ్వకపోవడం ఈ వర్గాలను పార్లమెంట్, అసెంబ్లీలోనూ, గ్రామస్థాయిలలో ప్రాతినిధ్యం లేకుండాపోయిందని అఖిలభారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం అడిక్‌మెట్‌లో అఖిలభారత వికలాంగుల హక్కుల వేదిక ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కొల్లినాగేశ్వరరావు మాట్లాడుతూ అన్యాయానికి, నిర్లక్ష్యానికి గురవుతున్న దివ్యాంగులకు ఓటుహక్కు ఉన్నట్లుగానే దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్‌లు కల్పించాలని, ఎస్సీలకు, బీసీలకు, మహిళలకు, చిన్న పిల్లలకు కమిషన్‌లను ఏర్పాటు చేసిన ప్రభుత్వం, వికలాంగుల కోసం ప్రత్యేక కమిషన్ లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. కేంద్రప్రభుత్వం వెంటనే వికలాంగులకు ప్రత్యేక జాతీయ కమిషన్ ఏర్పాటు చేయాలని, వికలాంగులకు ప్రత్యేక ఆరోగ్య పథకంను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2న 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐడిఆర్ఎఫ్ నాయకులు శివరాత్రి రాజయ్య, మహంకాళి రవీందర్, శ్రీనివాస్, ఉమ, గోవింద్‌రాజ్, పర్వతాలుఉ పాల్గొన్నారు.

### రామ్‌నగర్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

చిక్కడపల్లి, జులై 12 ప్రభాతవార్త: వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తుపై టిపిసిసి అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు నిరసనంగా బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కెటిఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ముషీరాబాద్ నియోజకవర్గంలోని రామ్‌నగర్ చౌరస్తాలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేసే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి, రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహ, మాజీ కార్పొరేటర్ ముఠాపద్మానరేశ్, రామ్‌నగర్, గాంధీనగర్, కవాడీగూడ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు రావులపాటి మోజెస్, ఎం.రాకేశ్‌కుమార్, వల్లాల శ్యామ్‌యాదవ్, నేతలు ఎర్రం శ్రీనివాస్‌గుప్త, ముఠా నరేశ్, మన్నెదామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత విద్యుత్ రద్దు చేయాలన్న దురాలోచనలో కాంగ్రెస్

### అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

హైదరాబాద్, జులై 12 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఉచిత విద్యుత్ అవసరం లేదంటూ టి-పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం బిఆర్ఎస్ కార్యకర్తలు నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రి చౌరస్తాలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రాష్ట్ర మంత్రి, బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఇచ్చిన పిలుపుమేరకు కార్యకర్తలు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యకర్తలు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ సిఎం కెసిఆర్ పాలనలో రైతులకు ఉచితంగా 24 గంటలపాటు విద్యుత్ సరఫరా చేయడంతో రైతులు పంటలు సమృద్ధిగా పండిస్తున్నారని, కెసిఆర్ రాష్ట్రాన్ని అన్నపూర్ణగా మార్చుతుంటే కాంగ్రెస్ పార్టీ ఉచిత విద్యుత్ రద్దు చేయాలన్న దురాలోచనతో ముందుకు వెళుతున్నదని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన అగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పాలను ఎప్పుడు కరెంటు ఉంటుందో, ఎప్పుడు పోతుందో ఎవరికి తెలిసేది కాదని, కెసిఆర్ సిఎం అయిన తరువాత కరెంటు సరఫరా సక్రమంగా జరుగుతున్నదని వివరించారు. రైతులకు 24 గంటలపాటు ఉచితంగా విద్యుత్ సరఫరా అవుతున్నదని స్పష్టం చేశారు. రైతుల విద్యుత్ పథకాన్ని రద్దు చేయాలని 3 గంటలపాటు విద్యుత్ సరఫరా చేయాలని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖిండించారు. తక్షణమే రేవంత్‌రెడ్డి రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్పోరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### రేవంత్‌రెడ్డి రైతాంగానికి బహిరంగ క్షమాపణ చెప్పాలి

సైఫాబాద్.. తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు కేవలం 3 గంటలు విద్యుత్ సరఫరా చాలని టి-పిసిసి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు తీవ్రంగా ఖండించారు. సిఎం కెసిఆర్ రైతులకు 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తుంటే రేవంత్‌రెడ్డి రైతాంగాన్ని నష్టపరిచేందుకు 3 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా సరిపోతుందని ప్రకటించడం దారుణమన్నారు. తక్షణమే రేవంత్‌రెడ్డి రైతాంగానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ రైతులకు ఉచితంగా సరఫరా చేయడం వల్ల రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు హాయిగా పంటలు పండించుకుంటున్నారని తెలిపారు.

## రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించారు

### మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్

ధర్నాచౌక్, జులై 12, ప్రభాతవార్త: విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను బీఆర్ఎస్ నాయకుల వక్రీకరించి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ ధ్వజమెత్తారు. బుధవారం ముషీరాబాద్‌లో డివిజన్ అధ్యక్షులు పెండం శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని, రైతుల సంక్షేమానికి తమ పార్టీ అధినేత పోరాడుతూ ఉంటే బీఆర్ఎస్ నాయకులు తమ రాజకీయలబ్ధి కోసం రేవంత్‌రెడ్డిపై తప్పుడు విమర్శలు చేస్తూ రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. ప్రజలెవ్వరూ బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మవద్దని సూచించారు. రోజు రోజుకు కాంగ్రెస్ బలమైన శక్తిగా మారుతూ ఉంటే, ఇది చూసి తట్టుకోలేక బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ అధికారంలోకి రావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు ఆర్ఎల్ రమేష్, పట్నం నాగభూషణం గౌడ్, జనిగే శ్రీనివాస్‌యాదవ్, చారి, వెంకట్, లింగం గుప్తా, గౌస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా వరాల పోచమ్మ అమ్మవారి కల్యాణోత్సవం

### హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితర ప్రముఖులు



చిక్కడపల్లి, జులై 12 ప్రభాతవార్త: భక్తులు తిలకిస్తుండగా, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవారి కల్యాణోత్సవ కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. గాంధీనగర్ డివిజన్ లోని జవహర్‌నగర్ ఆర్టీసిక్రా స్‌రోడ్స్‌లోని వరాల పోచమ్మ అమ్మవారి కల్యాణోత్సవ కార్యక్రమం బుధవారం ఆలయం చైర్మన్ సిహెచ్.నిరంజన్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.కనకరాజ్, యేసురత్నం, కోశాధికారి బి.శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగింది. ఉదయం గణపతి పూజ, నవగ్రహ పూజ, అమ్మవారికి దుర్గహోమం, కుంకుమా ర్చన కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అమ్మవారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహ, డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, నేతలు ముఠానరేశ్, ముచ్చకుర్తి ప్రభాకర్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కె.సాయిరామ్, కార్యదర్శులు ఎ.గణేష్, ఎం.కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా బోనాలు ఉత్సవాలు జరుపుకోవాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం బోనాలు ఉత్సవాలకు రూ.15కోట్లు విడుదల చేసిందని, వారం రోజుల ముందుగానే ఆలయాల నిర్వాహకులకు ఆర్థిక సహాయాన్ని అందించామని, పండుగలకు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.

## బోనాలకు ఆలయాల వద్ద ఏర్పాట్లు



బోనాల పండుల ఉత్సవాలల్లో పాల్గొన్న బిఆర్ఎస్ ఉద్యమ నేత ఆర్వీ మహేందర్‌కుమార్, బిఆర్ఎస్ యువ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్ యాదవ్,మాజీ సెట్విన్ డైరెక్టర్ ఎస్.ధన్‌రాజ్‌మాదిగ

అఫ్జల్‌గంజ్,జులై 12ప్రభాతవార్త: తెలంగాణ సంస్కృతీ,సంప్రదాయాలను ప్రతిబింబించే బోనాల పండుగను ఘనంగా నిర్వహించుకునేందుకు ఆలయాల వద్ద ప్రభుత్వం తరపున ఏర్పాట్లు చురుకుగా చేస్తుందని గోషామహల్ నియోజక వర్గం బిఆర్ఎస్ నాయకులు, ఉద్యమ నేత ఆర్వీమహేందర్‌కుమార్,బిఆర్ఎస్ యువ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్‌యాదవ్,మాజీ సెట్విన్, బిఆర్ ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్ మాదిగలు తెలిపారు.బోనాల ఉత్సవాలల్లో భాగంగా గోషామహల్ డివిజన్ పరిధిలో జరిగిన బోనాల పండుగ వేడుకల్లో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు.

### పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తుల అరెస్టు

యూసుఫ్‌గూడ, జులై 12, ప్రభాతవార్త : పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను బోరబండ పోలీసులు అరెస్టుచేశారు. బోరబండ పోలీస్‌స్టేషన్ సిఐ కామల్ల రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంజయ్య నగర్‌లో రోడ్డుపక్కన ఉన్న అరుగుపై పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులు చిదానందచారి, శివరామకృష్ణ, ధర్మరాజు, సింహాచలం, శ్యామల్ రావులతో పాటు వారి వద్ద నుంచి పదివేల రూపాయలను సీజ్‌చేయడం జరిగిందని తెలిపారు. బుధవారం ఉదయం వారిని నాంపల్లి కోర్టులో హాజరు పరుచగా న్యాయమూర్తి లక్ష్మణ్, వీరందరికి 14రోజుల జైలు శిక్ష విధించారని వీరందరిని చంచల్‌గూడా జైలుకు తరలించడం జరిగిందని పేర్కొన్నారు. బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇక నుంచి ఆరుబయట కానీ, చెట్ల పొదల్లోకానీ, ఎక్కడైనా ఎవ్వరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ కామల్ల రవికుమార్ తెలియజేశారు.

## నాలా పరివాహక ప్రాంతాల అభివృద్ధికి రూ.30 కోట్లు నిధులు మంజూరు

### మర్రి రాజశేఖర్ రెడ్డి



విలేకర్ల సమావేశంలో బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, జక్కుల మహేశ్వర్‌రెడ్డి, పాండు యాదవ్ తదితరులు

కంటోన్మెంట్, జులై 12 ప్రభాతవార్త: కంటోన్మెంట్ కూకట్‌పల్లి సరిహద్దుల్లోని నాలా పరివాహక ప్రాంతాల అభివృద్ధికి 30 కోట్ల రూపాయలు నిధులు మంజూరైనట్లు మల్కాజిగిరి పార్లమెంట్,కంటోన్మెంట్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం 1వ వార్డు సౌజన్య కాలనీలోని బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయిన్‌పల్లి సుచిత్ర,రామన్న కుంట చెరువు నుంచి బోయిన్‌పల్లి సెంటర్ పాయింట్ ఆర్‌ఆర్.నగర్, రామ్ రెడ్డినగర్, హర్షవర్ధన్ కాలనీ, సీతారామ్‌పూర్ కాలనీ వంటి 12 కాలనీలు 2.5 కిలో మీటర్ల పొడవులో ఉన్న కాలనీలో ముంపు నకుగురి కాకుండా శాశ్వత మరమ్మత్తులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావ్‌లను కలిసి మంత్రి కేటిఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ఎస్.ఎన్.డి.పి. నిధుల ద్వారా రూ.30 కోట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. కంటోన్మెంట్‌లో డ్రైనేజీ శాశ్వత మరమ్మత్తు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులతో బాక్స్‌డ్రైన్‌లను నిర్మించడం జరుగుతుందన్నారు. కేంద్రప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డుకు 850 కోట్లు కేంద్ర ప్రభుత్వం బకాయి ఉందన్నారు. కేంద్రం నిధులు విడుదల చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో బిజెపి ఓడిపోతుందన్న భయంతో 3 సంవత్సరాల నుంచి బోర్డు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పదవితో కాలయాపన చేస్తుందన్నారు. నామినేటెడ్ సభ్యునిగా కొనసాగుతున్న వ్యక్తి బ్రోకర్‌గా, జోకర్‌గా చెలామని అవుతున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, నళిని కిరణ్ బిఆర్ఎస్ నేతలు ముప్పిడి మధుకర్, ప్రవీణ్ యాదవ్, పెద్దాల నర్సింహ్మా, సాయి ప్రభాకర్, అజయ్ యాదవ్, రాజు సింగ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు



రహ్మత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించబడ్డ లియాకత్ ఆలీని అభినందిస్తున్న మాజీ శాసన సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, జులై 12, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఎపుడు ఉంటుందని జుబ్లీహిల్స్ మాజీ శాసన సభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు.బుధవారం రహ్మత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించబడ్డ లియాకత్ ఆలీ మర్యాదపూర్వకంగా మాజీ శాసన సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డిని డివిజన్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలతో కలిసి తరలివెళ్లి కలిశారు. ఈసందర్భంగా లియాకత్ ఆలీని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయడంతోపాటు పార్టీ ప్రతిష్టత కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. నియోజక వర్గంలోని నాయకులు, కార్యర్తలకు తామెప్పుడు అందుబాటులో ఉంటూ తగినవిధంగా ముందుకు వెళతామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వినోద్‌కుమార్ గౌడ్, ఎమ్‌డి జావేద్, రాములు, ఇబ్రహీం, హారుణ్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు జనాదరణ చేసి ఓర్వలేకపోతున్న బిఆర్ఎస్ : పారిజాత



బాలాపూర్ సబ్ స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న పారిజాత తదితరులు

**సరూర్‌నగర్, జూలై 12 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న జనాదరణ చూసి జీర్ణించుకోలేని బిఆర్ఎస్ పార్టీ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కుయుక్తులు చేస్తున్నదని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఆరోపించారు. టిపిసిసి పిలుపు మేరక బుధవారం మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట పారిజాత ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళన నిర్వహించి సిఎం దిష్టిబొమ్మను దహనం చేశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత విద్యుత్ పేరిట తెలంగాణ రైతాంగాన్ని మోసం చేస్తున్న బిఆర్ఎస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను వక్రీకరించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలను చూసి బెంబేలెత్తుతున్న బిఆర్ఎస్ తమ పార్టీపై అక్కసు వెళ్ళగక్కుతున్నారని మండిపడ్డారు. ఉచిత విద్యుత్ పేరుతో మోసం చేస్తున్న సిఎం కెసిఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీపై రాజకీయ కక్షతో వేసిన అనర్హత వేటుపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుంటే కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బిఆర్ఎస్‌లు కుమ్మక్కై కాంగ్రెస్‌ను టార్గెట్‌చేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆమె తెలిపారు. వీటిని తిప్పికొట్టడానికి కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు బండారి మనోహర్, నేనావత్ బాలు నాయక్, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎర్ర జైహింద్, బాల్‌నింగని జంగయ్య, రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, గుర్రం లక్ష్మారెడ్డి, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, తూళ్ళ నరహరిగౌడ్, గోరిగె శ్రీశైలం, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుభాన్ యాదవ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సత్యాగ్రహ మౌన దీక్షలో కాంగ్రెస్ నేతలు

**ఎల్.బి.నగర్, జులై 12 ప్రభాతవార్త :** ఏఐసీసీ పిలుపు మేరకు గాంధీభవన్ లోని మహాత్మాగాంధీ విగ్రహం ముందు సత్యాగ్రహ మౌనదీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఆర్కేపురం కొత్తపేట మీదుగా ప్రదర్శన నిర్వహిస్తూ గాంధీభవన్ బయలుదేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గట్ల రవీంద్ర, తలాటి రమేష్‌నేత, మహేందర్, రాజునాయక్, అక్బర్, పగడాల శ్రీశైలం, కళ్యాణ్‌యాదవ్, శ్రావణ్‌కురుమ, భాస్కర్‌నాయక్, శ్రీధర్, కృష్ణ, దల్లి, పింటు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు క్షమాపణ చెప్పాలి: శ్రీనివాస్‌రెడ్డి

**సైదాబాద్, జులై 12 ప్రభాతవార్త:** టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలని సైదాబాద్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులపై, ఉచిత విద్యుత్‌ను విమర్శిస్తూ రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యాలు చేయడం దారుణమని అన్నారు. రైతాంగానికి వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకుంటే గాంధీ భవన్ ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ సింగ్ ఠాకూర్, నందు, కిషోర్, పరమేష్, రమణాకర్, బాలకృష్ణ, కృష్ణమూర్తి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఖిల్లామైసమ్మ బోనాలకు దేపకు ఆహ్వానం

**ఎల్.బి.నగర్, జులై 12 ప్రభాతవార్త :** భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలు జరుపుకోవాలి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ ఫేస్‌లోని ఖిల్లామైసమ్మ దేవాలయంలో 16వ తేదీన నిర్వహించే బోనాల జాతరకు హాజరు కావాలని బుధవారం దేప భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను వలిగొండ కిషన్, సుశీల అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గట్ల రవీంద్ర, బొడ్డుపల్లీ మహేందర్, టైగర్ శివ, శ్రావణ్ కురుమ, శ్రీధర్, మహేష్, అనిల్‌రెడ్డి, మారయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల ఉత్సవాలు : రవికుమార్



బోనాల ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చౌకి రవికుమార్ తదితరులు

**మలక్‌పేట, జూలై 12 ప్రభాతవార్త :** ఈ నెల 16వ తేదీన జరుగనున్న బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఉత్సవాల కమిటీ ఛైర్మన్ చౌకి రవికుమార్ పేర్కొన్నారు. మలక్‌పేట శ్రీ పోచమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోనాల ఉత్సవాల సందర్భంగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు చౌకి సురేష్‌కుమార్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, టిన్నుసింగ్, గోమాత నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## భాష్యంలో నూతన విద్యార్థులకు ఘన స్వాగతం

**వనస్థలిపురం, జూలై 12 ప్రభాతవార్త :** భాష్యం పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతంపలుకుతూ ప్రలవి గార్డెన్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జడ్ఇఒ అంకమరావు హాజరై జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి నూతన విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంకమరావు మాట్లాడుతూ విద్యార్థిదశనుండే ఎన్నికల ప్రక్రియ తెలియజేస్తు అర్హులైన వారికి ఓటు వేసే జ్ఞానం పెరుగుతుందని, ఎన్నికలు, ఎన్నికలవిధానం కూడా అర్థమవుతుందన్నారు. అటువంటి పరిజ్ఞానంతో సమాజం చైతన్యవంతమవుతుందన్నారు. పాఠశాలలో నిర్వహించిన ఎన్నికల కార్యక్రమంలో గెలుపొందినవారికి బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమంలో అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సుజాత, హేమ, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కార్పొరేటర్ గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, జూలై 12 ప్రభాతవార్త :** రైతులకు ఉచిత విద్యుత్ గురించి పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు బుధవారం చిలుకానగర్‌లో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక ఆలోచనలకు నిదర్శనంగా రేవంత్ వ్యాఖ్యలు నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్‌రెడ్డి, కె.జగన్, రామానుజం, శ్రీనివాస్, పోచయ్య, బింగి శ్రీనివాస్, నారాయణరెడ్డి, రవీందర్‌గౌడ్, షఫీ, రాంరెడ్డి, శ్యామ్, సుభద్ర, సైనాజ్, సరిత, అండాలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : శ్రీకాంత్

**మలక్‌పేట, జూలై 12 ప్రభాతవార్త :** కాంగ్రెస్ అభివృద్ధి సాధ్యమని మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కావేటి శ్రీకాంత్, దేవరాయ ధనుంజయ, మదన్‌బాబులు పేర్కొన్నారు. నగరంలోని గాంధీ భవన్‌లో జరిగిన సత్యాగ్రహ దీక్షకు మలక్‌పేటనుండి నాయకులు, కార్యకర్తలతో కలిసి వారు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమంకోసం కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేస్తుందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు.

## గుర్రంగూడ మర్ల మైసమ్మ ఆలయానికి అటవీ భూమి కేటాయించాలని వినతి



కిషన్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, జూలై 12 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని గుర్రంగూడలో ఉన్న మర్ల మైసమ్మ అమ్మవారి దేవాలయానికి అటవీ శాఖ భూమిని కేటాయించాలని నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, దగిగ శంకర్ తదితరులతో కలిసి కిషన్‌రెడ్డికి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల జాతర, భక్తుల సౌకర్యార్థం నేపథ్యంలో మర్ల మైసమ్మ ఆలయానికి కొంత అటవీ శాఖ భూమి కేటాయింపు జరిగేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జక్కిడి మధుసూదన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పురాతన పైప్‌లైన్లతో మంచినీరు కలుషితం



పవన్‌కుమార్‌కు సమస్యలను చూపిస్తున్న సంగ్రామ్

**ఎల్.బి.నగర్, జులై 12 ప్రభాతవార్త :** పురాతన పైప్‌లైన్ల కారణంగా డ్రైనేజీ నీరు మంచినీటిలో కలిసి కలుషితమవుతుందని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ రత్ననగర్‌కాలనీలో గత 15 రోజులుగా డ్రైనేజ్ మురుగునీరు మంచినీటిలో కలుస్తుండడంతో ప్రజలు ఎంతగానో ఇబ్బందులకు గురవుతున్నారని కాలనీ అధ్యక్షుడు సంగ్రామ్ కార్పొరేటర్‌కు సమాచారం ఇవ్వడంతో వెంటనే బుధవారం సమస్యను పరిశీలించి సంబంధితఅధికారులకు ఫోన్‌చేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీనీళ్ల త్రాగునీటిలో కలుస్తున్న ప్రజల ఇబ్బంది పడుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మత్తు పనులు చేయాలని అవసరమైతే లైన్ మార్చాలన్నారు. డివిజన్లో దశాబ్దాల క్రితం నాటి డ్రైనేజీ లైన్లు పాతగా అయిపోవడంవల్ల ఇలాంటి సమస్యలు ఎన్నో బయటపడుతున్నాయని, దీంతో ప్రజలు అనారోగ్యంపాలై ఆసుపత్రిలో చేరుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోకుంటే జలమండలి కార్యాలయాన్ని ప్రజలతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు త్రాగునీటి ట్యాంకర్లను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సంగ్రామ్, లైన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

## కులంతార వివాహం చేసుకున్న జంటకు సహాయం

**ఉప్పల్, జూలై 12 ప్రభాతవార్త :** కులాంతర వివాహం చేసుకున్న జంటకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంజూరైన రూ.రెండున్నర లక్షల డిపాజిట్ బాండ్‌ను బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులాంతర వివాహాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అర్థిక సహాయం అందజేస్తుందన్నారు. అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ అధికారి శ్రీకర్‌రెడ్డి, బిఆర్ఎస్ నేతలు వెంకటేశ్వరరెడ్డి, ఆకుల ప్రభాకర్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతి

**రామంతాపూర్, జూలై 12 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని దేవేందర్‌నగర్ కాలనీలో అంబేద్కర్ అవాస్ యోజన కింద మంజూరైన గృహాలకు రుణమాపీ చేయాలని మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్ లక్ష్మినరసింహాకాలనీ ప్రాంతాన్ని ఇండస్ట్రీయల్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్పు చేయాలని కోరారు. కేటీఆర్ నగర్‌ను గతంలో ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో చేర్చుతూ హెచ్ఎండిఏ నోటిపై చేసిందని, తిరిగి డీనోటిఫై చేయాలని కోరారు. జైజవాన్ కాలనీ భూముల రిజిస్ట్రేషన్ సమస్యలు జిల్లా కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు మేకల హనుమంతరెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం సహకారంతో రేషన్ బియ్యం : ఎన్వీఎస్ఎస్



రేషన్‌షాపులను తనిఖీ చేస్తున్న ఎన్వీఎస్ఎస్, కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

**ఉప్పల్, జూలై 12 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే రేషన్ బియ్యం అందజేస్తున్నారని మాజీఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్‌తో కలిసి రేషన్ దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలు సేవా సుపరిపాలన గరీబీ కల్యాణ్ యోజనలో భాగంగా రేషన్‌కార్డుల లబ్దిదారులకు ఐదు కిలోల బియ్యం అందజేస్తున్నారని తెలిపారు. పేదలకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, అర్బన్ కార్యదర్శి రేవు నరసింహా, నారాయణదాసు, పర్వవేద వెంకట్రావ్, నాసు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఎమ్మెల్యే మంచిరెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న 21 వార్డు ప్రజలు

**తుర్కయంజాల్, జూలై 12 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ 21వ వార్డు పరిధిలోని సమస్యలను పరిష్కారానికి నిధులు కేటాయించాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని స్థానిక నేతలు కలిసి విన్నవించారు. 21వ వార్డులోని శ్రీసూర్యసాయినగర్ కాలనీ, జనచైతన్య కాలనీ, లక్ష్మీనగర్‌కాలనీల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంకోసం హెచ్ఎండీఏ నుంచి నిధులు మంజూరు చేయించేలా చూడాలని కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి మాట్లాడుతూ వెంటనే స్పందించి ఎస్టిమేషన్ వేసి పంపించాలని అధికారులకు సూచించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీకి ఎంత ఖర్చయినా వెంటనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు కొత్తకుర్మ కార్తీక్, వార్డు అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, జొన్నాడ రామ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, పి.రాజు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## నిధులు మంజూరైన పనులు ప్రారంభించలేదు : సామ రంగారెడ్డి



ఇంటింటికి బిజెపి కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి, లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, జూలై 12 ప్రభాతవార్త :** ఇంటింటికి బిజెపి కార్యక్రమం బి.ఎన్.రెడ్డినగర్ డివిజన్లో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో విజయపురి కాలనీ ఫేస్-1, ఫేస్-2, మెడికల్ అండ్ హెల్త్ కాలనీలో పాదయాత్ర నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ కార్పొరేటర్ లచ్చిరెడ్డితోకలిసి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిహెచ్ఎంసిలో అంతర్భాగమైన బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్‌లోని విజయపురికాలనీ, మెడికల్ అండ్ హెల్త్ కాలనీలు చిన్నపాటి వర్షానికి జలమయమై ఇళ్లలోకి నీరు వస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఉచిత మంచినీరు ఇస్తామని చెప్పి.. బిల్లుల మోత మోగిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిటి రోడ్ల నిధులు మంజూరైన రోడ్లు వేయడంలేదన్నారు. ప్రణాళికలేని బాక్స్ టైపు నాలాల నిర్మాణం వలన ముంపు సమస్య పెరిగింది తప్పా.. పరిష్కారం కాలేదన్నారు. నిధులు మాత్రం యధేశ్చగా దుర్వినియోగం చేస్తున్నారన్నారు. బంజారాహిల్స్, జూబ్లీ హిల్స్‌లో కట్టే టాక్స్‌కన్నా ఎల్.బి నగర్లో ఎక్కువ టాక్స్ విధిస్తున్నారన్నారు. మునుగోడు ఎలక్షన్ సమయంలో ఓట్ల కోసం 118జీఓ తీసుకువచ్చి మోసం చేశారని అన్నారు. సమస్యలను పరిష్కరించాలంటే బిజెపితోనే సాధ్యమని వచ్చే ఎన్నికలలో బిజెపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రావు, రవి శంకర్, మహేందర్‌రెడ్డి, జగన్, రాజు, శ్రీనివాసరావు, వెంకట్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత విద్యుత్ పేరిట బిఆర్ఎస్ దగా: చల్లా

**సరూర్‌నగర్, జూలై 12 ప్రభాతవార్త:** ఉచిత విద్యుత్ పేరిట కెసిఆర్ ప్రభుత్వం రైతులను దగా చేస్తున్నదని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆరోపించారు. టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం బాలాపూర్ చౌరస్తా సమీపంలోని లెనిన్‌నగర్ సబ్ స్టేషన్ ఎదుట డిసిసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సిఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్ విషయంలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి బిఆర్ఎస్ ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ అవినీతి, అక్రమాలు, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బిఆర్ఎస్ ప్రయత్నిస్తుందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్షను భగ్నం చేయడానికి బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి, బంగారు బాబు, చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, కీసర యాదిరెడ్డి, సురేందర్‌రెడ్డి, అహ్మద్ బామ్, భూపాల్‌రెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**మల్కాజిగిరి, జూలై 12 ప్రభాతవార్త :** టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మల్కాజిగిరి చౌరస్తాలో బిఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రైతు వ్యతిరేకతను చాటుకున్నాడని రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఎంత చేస్తుందో దేశానికి మొత్తం తెలుసన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వై.ప్రేమ్‌కుమార్, రాజ్ జితేంద్రనాథ్, నాయకులు పిట్టల శ్రీనివాస్, జగదీష్‌గౌడ్, రాముయాదవ్, పార్టీ మీడియా ఇన్చార్జ్ గుండా నిరంజన్, సతీష్ కుమార్, ఉపేందర్ రెడ్డి, తులసి సురేష్, ఉపేందర్ చెన్నారెడ్డి బాబు సత్యనారాయణ, పార్థసారథి, శివ, చెన్నారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఛలో హైదరాబాద్‌కు మున్సిపల్ కార్మికులు

**తుర్కయంజాల్, జూలై 12 ప్రభాతవార్త :** మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించి కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే, తదితర సిబ్బందిని అందరిని పర్మినెంట్ చేయాలని, 12వ పిఆర్సీ ఛైర్మన్ సిఫారసు చేసిన వేతనాలు వివిధ కేటగిరీల వారిగా రూ.19 వేలు, 22 వేలు, 31 వేలు రూపాయల కనీస వేతనాలు నిర్ణయించి ఇవ్వాలని, ప్రమాదంలో మరణించిన మున్సిపల్ కార్మికులందరికీ రూ. 25లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని వర్తింపజేయాలని, ఇతర పెండింగ్ సమస్యలన్నింటిని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు తుర్కయంజాల్ మున్సిపల్ కార్మికులు, యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి డి.కిషన్ ఆధ్వర్యంలో ఛలో సిడిఎంఏ కార్యాలయం హైదరాబాదుకు పెద్దఎత్తున తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.నగేష్, ఎన్.యాదగిరి, మేతరి నవీన్, మహేష్, రవిచందర్, మురళి, మహిపాల్, శివ, అమర్, రమేష్, లక్ష్మమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బేతిని విమర్శిస్తే ఊరుకోం : కాసం



సమావేశంలో మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి తదితరులు

**కుషాయిగూడ, జూలై 12 ప్రభాతవార్త :** నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిని విమర్శిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని బిఆర్ఎస్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్‌రెడ్డి తీవ్రంగా ఉప్పల్ ఎమ్మెల్యేపై కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ కాప్రాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి 4 సంవత్సరాలకు ఒకసారి గంగిరెద్దు వాళ్ళలా వచ్చి ఎలక్షన్లు కాగానే వెళ్లిపోతారని విమర్శించారు. సుభాష్ రెడ్డి తెలంగాణ ఉద్యమ నాయకునిగా, గత ఎన్నికలలో ఓడిపోయినప్పటికీ నియోజకవర్గాన్ని అంటిపెట్టుకొని ఉన్నారన్నారు. ప్రస్తుతం గెలిచి నాలుగున్నర సంవత్సరాలలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఎక్కడో బంజారాహిల్స్‌లో ఉంటూ నాలుగు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలకుముందు వచ్చి కనిపించిపోయే మీకు సుభాష్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు బేతాళ బాలరాజు, పెద్దాపురం కుమారస్వామి, మంజులసీతారాంరెడ్డి, ఎంపి. దాసు, యాకయ్య, మొగులయ్య, చిన్న రావు, యాదగిరి, మట్ట గిరి, భూపతి వెంకటేష్ గుప్తా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి



ఈటెల రాజేందర్‌ను సన్మానిస్తున్న కొప్పుల దినేష్

**మలక్‌పేట, జూలై 12 ప్రభాతవార్త :** ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి మూసారాంబాగ్ డివిజన్ బిజెపి వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల దినేష్ పేర్కొన్నారు. దినేష్‌ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి బిజెపి రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన ఈటెల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్‌లో బిజెపిని మరింత పటిష్టపర్చడానికి కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి వారిని చైతన్యపరుస్తామన్నారు. ప్రధాని మోడి దేశ ప్రజలకోసం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. బిజెపితో అభివృద్ధి సాధ్యమని ఆయన పేర్కొన్నారు.

## 16 నుంచి శ్రద్ధాబాద్ మార్కెట్ బోనాలు



శ్రద్ధాబాద్ మహంకాళి జాతర బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సుభాష్ చందర్జీ

**సైదాబాద్, జూలై 12 ప్రభాతవార్త :** బోనాల మహోత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని నగర మాజీ డిప్యూటీ మేయర్, శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ చైర్మన్ సుభాష్‌చందర్జీ అన్నారు. సైదాబాద్‌లో శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 45వ సంవత్సర మహంకాళి జాతర మహోత్సవం బ్రోచర్లను అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతర వివరాలు వెల్లడించారు. శ్రద్ధాబాద్ మహంకాళి జాతర ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 16న అమ్మవారికి బోనాల ఉత్సవం, 17న అమ్మవారి ఘటాల ఊరేగింపు, 18న సైదాబాద్ మార్కెట్‌లో అన్నదానం నిర్వహిస్తామన్నారు. పోతురాజులు, పౌరాణిక, దేశభక్తుల వేషధారులు, భక్తి భజన పాటలతో, చిన్నారులు యువత ఆటపాటలతో ఘటాల ఊరేగింపు వైభవోపేతంగా సాగుతుందన్నారు. అనంతరం ధోబీఘాట్ వద్ద ఘటాల నిమజ్జనంతో వేడుకలు ముగుస్తాయన్నారు.

**మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ఏర్పాటు...** శ్రద్ధాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సుభాష్‌చందర్జీ, అధ్యక్షుడిగా మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కడారి రామ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా సహదేవ్ యాదవ్, సంగోధి పరమేశ్‌కుమార్, గౌళీకర్ దినేష్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌చందర్జీ, కోశాధికారిగా గౌళీకర్ పూర్ణచందర్, కార్యదర్శులుగా గోపి, ఆశీష్ గౌలీకర్ నియమితులయ్యారు.

## వర్షాకాలంలాంటి లీడర్లకు ఎమ్మెల్యేను విమర్శించే అర్హత లేదు : జోన్ల ప్రభాకర్‌రెడ్డి

కుషాయిగూడ, జూలై 12, ప్రభాతవార్త. అకాల వర్షం నాటి అవసరం కొద్ది రాజకీయ స్వార్థం కోసం పనిచేసే కాంగ్రెస్ పార్టీ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి లాంటి అర్హత లేని నాయకులు ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని చర్లపల్లి డివిజన్ మాజీ వార్డు కమిటీ సభ్యులు తెలంగాణ ఉద్యమ నేత, ప్రజా సేవకులు జోన్ల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేను వర్షాకాలం నాయకులు, కేవలం ఎన్నికల సమయంలోనే ముందుకు వచ్చే స్వార్థపూరిత రాజకీయ నాయకులు చేసిన విమర్శలపై ఆయన మాట్లాడుతూ అర్హత లేని నాయకులు తమ నాయకుడిని విమర్శిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నరసింహ వేణుగోపాల్ రెడ్డి రెడ్డి నాయక్ ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ బీసీ సెల్ కార్యదర్శి సుభాష్ గోవింద్ కృష్ణ రమేష్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎల్.బి.నగర్ వినియోగదారుల ఫోరం కన్వీనర్‌గా భూపాల్‌రెడ్డి నియామకం




భూపాల్‌రెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

**ఎల్.బి.నగర్, జులై 12 ప్రభాతవార్త :** ఎల్.బి.నగర్ నియోజకవర్గం తెలంగాణ వినియోగదారులఫోరం కన్వీనర్‌గా పగిళ్ల భూపాల్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు జాతీయ కన్వీనర్ సింపుల్ రాథోడ్, రాష్ట్ర అధ్యక్షుడు అంజూ రాథోడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, రాష్ట్ర అధికార ప్రతినిధి కోత్వాల్ దయానంద్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టాన్ని ప్రజలందరూ ఉపయోగించుకునేవిధంగా ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు. నియోజకవర్గ స్థాయిలో నూతన కమిటీలను వేస్తామన్నారు. వినియోగదారుల చట్టానికి సంబంధించి ప్రజలలో అవగాహన పెంపొందిస్తామన్నారు.